

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ డ్వీపే డొయిచ్ ఖండే

**నాకు భయమేసింది.** ఆమె ఆంతర్యమేమిటో, ఆమె సంకేతానికి అర్థమేమిటో ఆలోచించడానికి కూడా ప్రయత్నించకుండా చటుక్కున చెయ్యి విదిలించుకుని అక్కణ్ణించి వెళ్లి మరోచోట బెంచీమీద కూర్చున్నాను.

ఎదుట కొత్త కొత్త దృశ్యాలు. మనసులో ఏమేమో ఆలోచనలు. అలా ఒంటరిగా ఎంతసేపున్నానో – కాసేపటికి ఓ ముసలాయన వచ్చి నాపక్కన కూర్చున్నాడు. ఆయనతోపాటే ఓ ఆల్సేషియన్ డాగ్ ఉంది.

నాకు కుక్కలంటే భయం. అవి నిజంగా మంచివైనా పొరపాటున కరిచే ప్రమాదం లేకపోలేదు. పాము కరిస్తే విషానికి విరుగుడుండొచ్చు. కానీ కుక్కకాటువల్ల వచ్చే రేబీస్ వ్యాధి అంతకంటే చాలా భయంకరమైనదన్న భావన నాలో చిన్నప్పుడే బలపడిపోయింది. అందుకని వాటికి వీలైనంత దూరంగా ఉంటాను.

ఇప్పుడు నా పక్కన కూర్చున్న ముసలాయన దగ్గర ఆల్సేషియన్ని చూడగానే అక్కణ్ణించి లేచిపోబోయాను.

ముసలాయన నా భుజంమీద చెయ్యేసి ప్రేమగా నిమిరి, "సిట్ డౌన్ మై బాయ్" అన్నాడు ఇంగ్లీషులో.

మొహమాటపడి ఇబ్బందిగా కూర్చున్నాను.

ముసలాయన నా వివరాలడిగాడు. చెప్పాను.

"నాకు ఇండియన్సంటే ఇష్టం. ఇంటికోసం నువ్వు శ్రమ పడకు. నాతో వచ్చి నా ఇంట్లో ఉండు. మా ఇంటినుంచి ఊబాన్లో నీ ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లడానికి పది నిముషాల ప్రయాణం – అంతే!" అన్నాడు.

"చాలా థాంక్స్, కానీ నాకు ఇల్లు దొరికేసిందిగా" అన్నాను.

"దొరికితేనేం, పోయిన అడ్వాన్స్ పోయిందనుకో. నువ్వు నా ఇంట్లో ఊరికే ఉండొచ్చు"

బెర్లిన్లో ఫ్రీ అకామడేషన్. నెలకి నూటయాభై మార్కుల ఆదా. ఒక్క క్షణం మనసు ఊగిసలాడింది. కానీ ప్రతి ఔదార్యం వెనుకా ఏదో స్వార్థముంటుంది. ఎక్కడైనా మినహాయింపులుండొచ్చేమో కానీ ఈ దేశంలో మాత్రం అలాగనుకుందుకు లేదు.

రేపట్నించి నాదే అవనున్న గదిలో ముందుగా ఈ ఒక్క రాత్రి పడుకునేందుకు ఫ్రౌ ఒలోముచ్‌కీ నన్ను పది మార్కులు అడిగింది. అలాంటిది ఈ ముసలాయన ఇక్కడున్నంత కాలమూ తనింట్లో ఊరికే ఉండొచ్చంటున్నాడు. ఏదో కారణం ఉండే ఉండాలి.

ఇలంటి అనుమానాలతో, "నేనెందుకు రావాలి, ఎవరికోసమో" అన్నట్లు మొహం నేను పెట్టాను.

అది అర్థం చేసుకున్నాడేమో, "నీవు లేక నేను లేనె లేనులే, అది నిజములే" అన్న మొహం ఆయన పెట్టాడు.

ఆయన బలవంతపెట్టినకొద్దీ నా అనుమానం పెరిగింది. ఆ అనుమానంతో చూడగానే ఉన్నట్లుండి ఆయన ముఖం ఇంకోలా మారిపోయింది. ఆ ముఖం ల్యూనబర్గులో ఫ్రౌ యాకెల్ ఇంటికి నాకోసం వచ్చిన జర్మన్ వృద్ధుడి మొహానికి ప్రతిబింబంలా కనబడింది.

"అదిగో పులి అన్నాయి" నా కళ్లు. అప్పుడు ఇదిగో తోక అనే బాధ్యత తీసుకున్న నా ముక్కు "ఔను, ఆయనే! నాకు ఉడుకులాం వాసన కూడా తెలుస్తోంది" అంది.

ఆ తర్వాత ఆయన బలవంతపెడుతూ ఎన్ని చెప్పినా – "నాకు చెవుడు, శంఖం ఊదొద్దు" అనే లెవెల్ మెయింటైన్ చేశాను. మనసులో మాత్రం, "ఇదెక్కడి కర్మరా బాబూ!" అనుకున్నాను.

ల్యూనబర్గులో ఉండగా ఎవరో అన్నారు నాతో – బెర్లిన్ హోమోసెక్సువల్స్‌కి ప్రసిద్ధి అని. ఈ ముసలాయన ఎలాంటివాడో తెలియదు కానీ, నా భయం నాది.

ఆయనతో జరిగిన మానసిక యుద్ధం ఒకందుకు నాకు ఉపకరించింది. ఎలా గడిచిందో తెలియకుండా టైం ఎనిమిదయింది.

లాకర్లోంచి సూట్‌కేస్ తీసుకున్నాను. టాక్సీని పిల్చుకున్నాను. ఐదు నిముషాల్లో గమ్యస్థానం చేరాను.

ఒలోముచ్‌కీ ఉండే ఆపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ ప్రవేశద్వారం మూసి ఉంది. అక్కడ కాలింగ్‌బెల్ లాంటిదేదీ కనబడలేదు. తలుపు తడితే ఏ రెస్పాన్సూ లేదు.

"ఎవరో రావాలీ" అని మనసులో పాడుకుంటూ సుమారు గంటసేపు అక్కడే ఉన్నాను. అప్పటికి నా మొర విని నన్ను కరుణించడానికన్నట్లు తలుపు తెరుచుకుని ఓ వ్యక్తి బయటకు వచ్చాడు. కానీ ఆ వ్యక్తి నన్ను పట్టించుకోకుండా ముందుకు వెళ్లిపోయాడు. అతణ్ణి ఏదో అడుగుదామనుకున్నాను కానీ అప్పుడు తెరుచుకున్న తలుపు మళ్లీ మూసుకుపోతోంది. అతనికంటే తలుపుని నమ్ముకోవడమే మెరుగని – దాన్ని ఒక చేత్తో ఆపి రెండో చేత్తో సూట్‌కేస్ పట్టుకుని రెండు కాళ్లనీ కూడగట్టుకుని లోపలికి దూరేశాను. మెట్లెక్కి రెండో అంతస్తు చేరుకుని ఒలోముచ్‌కీ ఇంటిగుమ్మం ముందు నిలబడ్డాను. ఇత్తడి హోల్డర్ని పైకెత్తాను.

కొద్ది క్షణాల్లో తలుపు తెరుచుకుంది. ఒలోముచ్‌కీ నాముందు ప్రత్యక్షమైంది.

అప్పుడామె నాకు అసురమాతలా కాక సురకన్యలా కనిపించింది. చేతిలో సూట్‌కేస్ కింద పెట్టలేదు కాబట్టి కానీ అప్రయత్నంగా చేతులు జోడించి, "మాణిక్యవీణాం" అని అందుకునేవాణ్ణేమో!

జరిగింది విని ఒలోముచ్‌కీ నొచ్చుకుంది. ప్రవేశద్వారానికి వేరే తాళం ఉంటుందిట. అది లేకపోతే లోపలకి రావడం అసాధ్యమట. సాధారణంగా తొమ్మిదిన్నర వరకూ ఆ ద్వారము తెరిచియే ఉండునట. ఆ రోజు ఏదో పొరపాటు జరిగి ఉండాలంది.

ఏదేమైతేనేం పది మార్కులు తీసుకున్నప్పటికీ ఆమె నిబద్ధతని అభినందించాలి – ఆమె అప్పటికే ానా కోసం గదినీ, గదిలో పక్కనీ సిద్ధం చేసి ఉంచిందిట!

మలిరోజులు

వారం రోజుల్లో నా ఇన్స్టిట్యూట్‌కే కాదు, బెర్లిన్ నగరానికీ కొంత అలవాటు పడ్డాను.

పశ్చిమ జర్మనీ వాసులందరికీ బెర్లిన్ నగరంపై ప్రత్యేకమైన మక్కువ ఉంది. తమ దేశానికి ఆహ్వానంమీదో, యాత్రీకులుగానో వచ్చిన ప్రతివారినీ – తిరిగి వెళ్లేలోగా ఒకసారి బెర్లిన్ నగరం చూసి తీరాలని అక్కడి పౌరులు చెబుతూంటారు. అలా చూసివచ్చినా వారి ద్వారా – ల్యానబర్గులో ఉండగానే – బెర్లిన్ నగరపు హయలు, సొగసుల గురించి కొంత విన్నాను. విన్నదాంట్లో ఆవగింజంత అసత్యమైనా లేదని ప్రత్యక్షంగా చూస్తున్నప్పుడూ అనిపించింది.

బెర్లిన్ రైల్వే స్టేషనుకి దగ్గర్లోని ఒక ముఖ్య ప్రాంతం కుర్‌ఫ్యూర్‌స్టెన్ డామ్. స్థానికులు దానికి పెట్టుకున్న ముద్దుపేరు కు–డామ్. ఒలోముచ్‌కీ ఇంటినుంచయితే అక్కడికి కాలినడకన చేరుకుందుకు ఇరవై నిముషాలు పడుతుంది. అక్కడున్న దుకాణాలు, హటళ్లు అన్నీ – విదేశీయాత్రికుల్ని దృష్టిలో ఉంచుకుని రూపొందడంవల్ల – ఆ ప్రాంతం యాత్రికులకు ప్రత్యేక ఆకర్షణ.

అందమైన ఆ వీధిలో దీపాలతో రూపొందిన ఓ గడియారముంది. చూడగానే గడియారం అనిపించదు. కొన్ని వరుసల్లో ఆకుపచ్చని, ఎర్రని దీపాలున్నాయి. కొన్ని గంటల్నీ, కొన్ని నిముషాల్నీ, కొన్ని సెకన్లనీ సూచిస్తాయి. వెలుగుతున్న దీపాల్నిబట్టి లెక్కకట్టి టైం తెలుసుకోవచ్చు. ఆ దీపాల లెక్కతో టైమ్ తెలుసుకోవడానికి అక్కడ ఎప్పుడూ పెద్ద గుంపు ఉంటుంది. విశేషమేమిటంటే ఆ జనంలో లెక్కలు రానివాళ్లు కూడా చాలామంది ఉంటారుట. అదో ఆకర్షణ!

మొదట్లో నేను ఏం కావాలన్నా కు–డామ్‌కి వెళ్లేవాణ్ణి. కానీ నా ఇంటివెనుకపక్కనే ఉన్న విల్మెర్స్‌డాల్ఫర్ స్ట్రాసేలో చాలా పెద్ద బజారున్న విషయం తెలుసుకుందుకు ఎన్నో రోజులు పట్టలేదు. ఆ వీధిలో సూపర్ మార్కెట్లే మూడో నాలుగో ఉన్నాయి. కేవలం బట్టలకే సే

ఉంట్ ఆ (సి అండ్ ఎ) అనే బహుళ అంతస్తుల దుకాణముంది. అవికాక వాచీలు, జోళ్లు వగైరాలు దొరికే చిల్లర దుకాణాలకు లెక్కే లేదు. కుడామ్ కంటే మా ఇంటి పక్కవీధి దుకాణాల్లోనే సరుకులు చవగ్గా కూడా ఉన్నాయి.

ఆ విషయం తెలిసిన మరికొద్ది రోజులకే ఆ వీధిలో ఆల్‌బ్రెస్ట్ దుకాణం కూడా కనిపించింది. అదీ మా ఇంటికి బాగా దగ్గరగా!

ఇక నా ఆనందానికి అవధుల్లేవు. నియంత్రణ ఉన్నప్పుడు మన దేశంలో కోఆపరేటివ్ స్టోర్సులో పంచదార ఎంత చౌకగా దొరుకుతుందో – ఇక్కడ పాలు, పప్పులు, బియ్యం వగైరా ఆహార దినుసులన్నీ అంత చవగ్గానూ దొరుకుతాయన్నది ల్యూనబర్గులో రామచంద్రద్వారా తెలుసుకున్నాను కదా మరి!

ల్యూనబర్గులో మార్కెట్ ఏరియాలో ప్రతి బుధ, శనివారాలూ సంత జరిగేది. ఆ సంతకు పల్లెటూళ్లనుంచి కూరగాయలు, పళ్లు, పాలు వగైరా వస్తువులు తెచ్చి అమ్మేవారు రైతులు. ఆ సంతలో సరుకులు తాజాగానూ, చవగ్గానూ ఉంటాయని యాకేల్ నాకు చెప్పింది. ఆమె సంత రోజుల్లో సంతకెళ్లి తనక్కావాల్సినవన్నీ కొనుక్కు తెచ్చుకునేది.

సంతలో పాలు, వెన్న, బియ్యం వగైరాలు ముందుగా ప్యాక్ చేసినవి కాక, అప్పటికప్పుడు తక్కెడలో తూచి కానీ, పాత్రలతో కొలిచికానీ అమ్ముతారు. మన సంతలో లాగే సరుకుల్ని వర్ణిస్తూ, వాటి ధరల్ని గట్టిగా అరిచి చెబుతారు. కస్టమర్సుని రమ్మని కేకలు పెడుతుంటారు.

సంతకి సరుకుల రవాణాకి పల్లెటూరి రైతులు చిన్నసైజు వ్యాన్లని వాడతారు. కారవాన్‌లుగా వ్యవహరించబడే ఆ వాహనాలు మామూలు వ్యాన్లు కాదు. వంటకీ, స్నానానికీ, పడకకీ సదుపాయాలున్న సంచార గృహాలవి.

ఆ సంతలు ప్రతి నగరంలోనూ సాధారణంగా వారానికి రెండు రోజులు జరుగుతాయనీ – ఉదయం ఎనిమిదినుంచి, మధ్యాహ్నం రెండువరకూ నడుస్తాయనీ విన్నాను.

సంత కూడా షాపుల్లాగే టైం విషయంలో ఖచ్చితంగా ఉంటుంది. రైతులు అమ్మకాలయ్యేక, నగరంలో కాసేపు కులాసాగా గడిపి మళ్లీ గ్రామానికి వెళ్లిపోతారు.

ఇలాంటి సంతలు బెర్లిన్ నగరంలోనూ వివిధ ప్రాంతాల ఉన్నాయి. మా ప్రాంతపు సంత – నేనున్న భవనానికి ఎదుట సరిగ్గా యాభై గజాల దూరంలో బుధ, శనివారాల్లో వస్తూంటుందని తెలిసి అది నా అదృష్టంగా భావించాను.

స్వయంగా వండుకునే అవకాశం లేనప్పుడు ఈ సంతల్ని అంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు కాస్త శ్రద్ధగా గమనిస్తే – తాజా వంకాయలు, క్యాబేజి, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, టమేటాలు, పచ్చిమిరపకాయలు వగైరాలు ఇక్కడ సూపర్ మార్కెట్లలోకంటే బాగా చౌకగా దొరికేవి.

బుధ, శనివారాల్లో సంతకి వెళ్లి కావాల్సిన పళ్లు, కూరలు కాస్త ఎక్కువే కొనడం అలవాటు చేసుకున్నాను. అసలే చలిదేశం. ఆపైన ఫ్రిజ్ సదుపాయముంది. సరుకు పాడౌతుందన్న భయం లేదు.

ఇండియాలో ఐతే అప్పటికి మాబోంట్లకి ఫ్రిజ్ అంటే లగ్జరీయే కావడంతో, నాకు ఇన్‌స్టిట్యూట్‌లో పరిశోధనలతో పాటు – ఇంట్లో ఆధునిక పరికరాల వాడకం విషయంలోనూ కొంత శిక్షణ లభిస్తోంది.

నా దినచర్య నిర్దుష్టంగానే ఉండేది.

ఉదయం లేవగానే నాలుగు బ్రెడ్ స్లైసులు తీసుకుని వాటికి వెన్న, జాం రాసుకుని తినేవాణ్ణి. అరలీటరు పాలు తాగేవాణ్ణి. ఓ పండు తినేవాణ్ణి. ఆఫీసుకి నాలుగు బ్రెడ్ స్లైసులు తీసుకెళ్లి లంచ్ టైంలో తినేవాణ్ణి. రాత్రికి వంటలోకి అన్నం, కూర, సాంబారు చేసుకునేవాణ్ణి. సాంబారులోకి చింతపండుకి బదులు నిమ్మరసం వాడేవాణ్ణి.

ఒకప్పుడు సాంబారంటే ఎంతో కష్టమైన వంటకం అనుకునేవాణ్ణి. ల్యూనబర్గులో రామచంద్ర దాన్ని అతిసులభం చేసేశాడు.

కొబ్బరికోరు ప్యాకెట్లలో దొరికేది. వంకాయ, క్యాబేజి, ఉల్లి వగైరాలు ముక్కలుగా తరిగి నీళ్లలో వేసి, దానికి కొబ్బరికోరు కలిపి స్టౌమీద ఉంచి ఉడకబెట్టేవాణ్ణి. చివర్లో సాంబారు పొడి వేసేవాణ్ణి. సాంబారు పొడి, ఇంకా ఇతర ఇండియన్ మసాలా పొడులు అక్కడ అన్ని షాపుల్లోనూ దొరికేవి. సాంబారు ఉడికి మంచి వాసన వేసేక, అప్పుడు నిమ్మకాయ పిండి వెంటనే స్టవ్‌మీంచి దింపేసేవాణ్ణి.

సిమ్లా మిర్చిని పాప్రికా అనేవారక్కడ. పాప్రికా, వంకాయ, బంగాళాదుంపలతో – రోలు అవసరం లేకుండానే మసాలా కూరలు చేసుకునే విధానం నాకు తెలియడానికి – నటరాజన్, కొరియా, రామచంద్ర, దేవదార్లు మార్గదర్శకులు. వాళ్లని తలచుకుంటూ ఆ వంటలు చేసుకుని తినేవాణ్ణి.

వచ్చింది రీసెర్చి కోసం. ఐనా భోజనం ఆసక్తికరంగా లేకపోతే రీసెర్చిమీద మాత్రం దృష్టి పెట్టడం కష్టం కదా! ఏదో వారం పదరి రోజులైతే అనుకోవచ్చు. ఏడాదుండాలి. అందుకని మన ఊరగాయల కోసం షాపుల్లో వెదికేవాణ్ణి. అలా కొన్ని షాపుల్లో అమెరికన్ ఫుడ్ ప్రొడక్ట్సు (బొంబాయి) పేరిట మన ఊరగాయలు దొరుకుతున్న విషయం తెలుసుకున్నాను.

ఇండియాలో ఉండగా జ్వరమొస్తే కూడా బ్రెడ్ తినడానికి ఇష్టపడని నాకిప్పుడు రోజూ అదే ఫలహారం, మధ్యాహ్నభోజనం. అది కాస్త బాధాకరంగానే ఉన్నా, ల్యూనబర్గుతో పోలిస్తే ఇక్కడి తిండి సదుపాయం బాగా మెరుగయింది.

పొద్దున్నే ఏ ఉప్మాయో చేసుకోవచ్చు. అందుకు పెందరాళే లేవాలి. కానీ ఆహ్లాదకరమైన చలిలో, వెచ్చని రొజాయిలోంచి ఉదయం ఏడు లోపల లేవబుద్ధేసేది కాదు.

ఎనిమిదింటికల్లా ఆఫీసుకి చేరుకోవాలంటే – కనీసం ఏడున్నరకి ఇంట్లో బయల్దేరాలి. ఏడుకి లేచి తెములడం మొదలెడితే బ్రెడ్ స్లైసులకి జాం రాసుకోవడం తప్ప – ఇక టిపిను చేసుకునే టైమేదీ?

నేను ఉదయం లేచి ఆఫీసుకి వెళ్లేదాకా ఇంటామె తన గదిలోంచి బయటకొచ్చేది కాదు. ఉదయం ఎనిమిదినుంచి సాయంత్రం ఐదు దాకా ఆఫీసు. అప్పుడు ఆరున్నరవరకూ కొత్త కొత్త షాపులు చూసి ఎక్కడెక్కడ ఏమేమున్నాయో, ఎంతలో ఉన్నాయో తెలుసుకునేవాణ్ణి. ఇల్లు చేరాక ఇంటామె వచ్చేలోగా వంట చేసుకుని తిని పడుకునేవాణ్ణి.

నేను బెర్లిన్ చేరిన కొద్ది రోజుల్లోనే యూనివర్సిటీలో జర్మన్ పరీక్షకు కూర్చోవాల్సి వచ్చింది. ల్యూనబర్గులో ఉండగా నాలుగు నెలల్లో రెండు పరీక్షలు ప్యాసయ్యాను. ఇది మూడోది. ఇది ప్యాసవ్వాలన్న నియమం లేదు కానీ, పరీక్ష మాత్రం వ్రాసి తీరాలి.

పరీక్ష మయసభలో. ఎలాగో పరీక్ష హాలుకి వెళ్లాను. పేపర్ చూస్తే సులభంగానే ఉందనిపించింది కానీ, కొన్ని పదాల అర్థం తెలుసుకుందుకు నిఘంటువు కావాలి. ఈ పరీక్షకి నిఘంటువు దగ్గరుంచుకోవచ్చని అక్కడ మిగతావారిని చూసేక అర్థమయింది.

నా దగ్గరో పాకెట్ సైజు నిఘంటువుంది. కానీ అది ఆఫీసులో ఉండిపోయింది. వెళ్లి తెచ్చుకుందామంటే బోలెడు టైము వృథా. అందుకని అక్కడ పరీక్ష వ్రాస్తున్న దేశపాండే అనే ఇండియన్ దగ్గరకెళ్లి, "ఒక్కసారి నీ డిక్షనరీ ఇస్తావా? కొన్ని పదాల అర్థం చూసుకుని కొద్ది నిముషాల్లో ఇచ్చేస్తాను" అనడిగాను.

"డిక్షనరీ కొద్ది నిముషాలుంటే కావలసినదంతా ఆకళింపు చేసుకునే శక్తి నీకుండొచ్చు. ఒక్క క్షణం కూడా అది లేకుండా పరీక్ష వ్రాసే సామర్థ్యం నాకు లేదు" అన్నాడతను.

అది వ్యంగ్యం కావచ్చు, నిజం కావచ్చు. అతను డిక్షనరీ ఇవ్వననడంలో న్యాయముంది. కానీ చెప్పిన పద్ధతికి మనసు నొచ్చుకుంది.

అతను కూడా ఇండియానుంచి నాతోపాటు సెలక్టయి నేనొచ్చిన విమానంలోనే ఇక్కడికొచ్చిన డాడ్ స్కాలరే. వేరే ఊళ్లో గ్యోతే ఇన్స్టిట్యూట్లో జర్మన్ భాష నేర్చుకుని బెర్లిన్ నగరం చేరాడు.

నిఘంటువుకోసం నేను ఇన్విజిలేటర్ అనుమతి తీసుకుని హాల్లోంచి బయటకు వచ్చాను. రోడ్డుకి అవతలపక్కనున్న నా ఆఫీసుకి వెళ్లాను. డిక్షనరీ తీసుకున్నాను. కానీ చివరకు అనుకున్నంతా అయింది. పరీక్ష హాలుకి వస్తూ మయసభలో దారి తప్పాను. వాళ్లనీ, వీళ్లనీ అడిగి పరీక్ష హాలు చేరుకునేసరికి అరగంటపైన సమయం వృథా ఐపోయింది. నిఘంటువు కూడా నాకు అంతగా ఉపయోగపడలేదు. చాలా పదాలకు అర్థం ఊహించి రాసేశాను.

జర్మన్ భాషలో పదాల అర్థం తెలుసుకుందుకు ఊహ అంతగా ఉపయోగపడదు. ఉదాహరణకు కున్ఫ్ట్ అనే పదాన్ని తీసుకుంటే– అన్‌కున్ఫ్ట్ అంటే రాకడ, అబ్‌కున్ఫ్ట్ అంటే పోకడ. ఈ పదాలు రైల్వే ప్లాట్‌ఫారాలమీదా, ఎయిర్‌పోర్టుల్లోనూ కనపడతాయి. అయితే ఔస్‌కున్ఫ్ట్ అంటే సమాచారం, ఉంటర్‌కున్ఫ్ట్ అంటే వసతి.

ఇలాంటివన్నీ నాకు ఇదివరకటి పరీక్షల్లో అనుభవం. అందుకని ఈసారి పరీక్ష పోతుందని ఊహించాను. పదాల అర్థాలు గ్రహించడంలో తప్పయిన నా ఊహ – పరీక్షా ఫలితం విషయంలో మాత్రం తప్పు కాలేదు.

మా చిన్నప్పుడు ఎస్సెస్సెల్సీ పరీక్షా ఫలితాలు రాగానే – 'ప్యాసయినా, తప్పినా – చదవండి ఓవర్సీర్ కోర్సు' అంటూ అడ్వర్టయిజ్‌మెంట్లు వచ్చేవి. అలాగే మేమిక్కడ జర్మన్ పరీక్ష వ్రాస్తే చాలు – ఫలితంతో నిమిత్తం లేలుండా, వెంటనే మాకు స్టూడెంట్ ఐడెంటిఫికేషన్ కార్డు ఇస్తారు. ఇచ్చే కార్డుల్లో మాత్రం తేడా ఉంటుంది. ప్యాసైనవారికి 'పెద్ద గుర్తింపు', ఫెయిలైనవారికి 'చిన్న గుర్తింపు' అని ముద్ర కొడతారు. పెద్ద గుర్తింపు వారు ఎంత కాలమైనా యూనివర్సిటీ విద్యార్థిగా కొనసాగవచ్చు. చిన్న గుర్తింపువారు మూడు సెమిస్టర్లు అంటే పద్దెనిమిది నెలలు మాత్రమే స్టూడెంటుగా ఉండగలరు. ఇంకా కొనసాగాలంటే వారు మళ్లీ పరీక్షకి కూర్చోవాల్సి ఉంటుంది.

అలా నాకు చిన్న గుర్తింపు కార్డు వచ్చింది.

ఈ ఐడెంటిటీ కార్డు వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి. బెర్లిన్లో – బస్సు, ఊబాన్ వగైరాల్లో ఏదో ఒకదాంట్లో నాకు నెలవారీ పాస్ వస్తుంది. అదుంటే కేవలం పది మార్కులకి నెల్లాళ్లపాటు బెర్లిన్ అంతా ఎన్నిమార్లయినా యథేచ్ఛగా తిరగొచ్చు.

నాకు బస్సు కంటే ఊబాన్ (అండర్‌గ్రౌండ్ రైలు) ఎక్కువ నచ్చింది. అందులో నెలవారీ పాస్ కొనుక్కున్నాను.

మామూలుగా ఐతే ఊబాన్ టికెట్ ట్రిప్పుకి అరవై ఫెన్నిగ్సు. నాలుగు ట్రిప్పులకి ఒక్కసారే కొనుక్కునే మాటయితే రెండు మార్కులకే కన్సెషన్ టికెట్ దొరుకుతుంది. అదే చౌక అనుకునేవాణ్ణి. అలాంటిదిప్పుడు నెల పొడుగునా ఎన్ని ట్రిప్పులు వేసినా నెలకి పది మార్కులే అంటే కారు చౌక కదా!

అసలే పశ్చిమ జర్మనీలో మిగతా నగరాలన్నింటికంటే పశ్చిమ బెర్లిన్లో అన్నీ చౌక.

క్రమంగా నా పరిసరాలమీద నాకు పట్టొస్తోంది. అనుకోకుండా నేనుంటున్న ఇల్లు మంచి సెంటర్లో ఉంది. ఇంట్లోంచి బయటకు రాగానే అటుపక్క సూపర్ మార్కెట్ల వీధి. ఇటుపక్క రెండు నిముషాలు నడిస్తే ఊబాన్‌హాఫ్ (ఊబాన్ స్టేషన్). దాని పేరు డాయిచే ఓపర్ (జర్మన్ థియేటర్). అక్కడ ఊబాన్ ఎక్కితే తరువాతి ఊబాన్‌హాఫ్ ఎర్నస్ట్ రాయిటర్ ప్లాట్జ్. అక్కడ ట్రయిన్ దిగితే ఆఫీసుకి మరో రెండు నిముషాల నడక. ఊబాన్ వద్దనుకుంటే నా ఇంటినుంచి నడిచి వెళ్లినా పది నిముషాల్లో ఆఫీసు చేరుకోవచ్చు.

విచిత్రమేమిటంటే – జర్మన్ పేర్లు పలకడానికి ఇంత కష్టంగా ఉంటాయా – ఏ ఒత్తులూ లేని నా పేరుని రాజగోపాలరావు అని పలకడానికి జర్మన్లు నానా యాతనా పడేవారు. పైగా ఇండియన్ పేర్లు పలకడానికి చాలా కష్టమనేవారు. కష్టమనేది ఇష్టాన్నిబట్టీ, అలవాటునిబట్టీ ఉంటుందనుకోవాలి.

ఆఫీసు ముచ్చట్లు

క్రమంగా మా డిపార్టుమెంట్లో కొందరు రీసెర్చిస్కాలర్సుతో పరిచయమైంది. అంతా స్నేహపూర్వకంగా మాట్లాడేవారు. ఇక్కడ నేను గమనించిందేమిటంటే – పనివేళల్లో ఎవరూ క్షణం కూడా వృథా చెయ్యరు. అవసరానికి పలకరించినా ఉబుసుపోక కబుర్లకి తావుండదు. ఎవరైనా ఎవరికైనా సాయం చేస్తామంటే యథాలాపంగా అనరు. మాట హృదయంలోంచి వస్తుంది. సాయం చేసే ఉద్దేశ్యం లేకపోతే ఆ ప్రస్తావనే తేరు. సాధారణంగా అందరూ చాలా ఉత్సాహంగా, సరదాగా ఉంటారు.

డిపార్టుమెంట్లో ఆడుకుందుకు ఓ టేబుల్ టెన్నిస్ బోర్డుంది. భోజన విరామ సమయంలో కొందరు అక్కడ చేరి ఆడేవారు. వారివారి అభిరుచుల్నిబట్టి కొందరు పని చేస్తూనే సంగీతం వినేవారు. అందుకు వాళ్ల దగ్గర రేడియోలో, టేపు రికార్డర్లో ఉండేవి. గ్లాస్ బ్లోవర్ గదిలో ఐతే కాలక్షేపానికి టెలివిజన్ కూడా ఉంది.

డాడ్ స్కాలర్ షిప్ ఏడాదికి మాత్రమే. అందులో చాలా సమయం – కొత్త దేశాన్ని అర్థం చేసుకుందుకూ, ముచ్చట్లు తెలుసుకుందుకూ, అక్కడి విధానాల్ని పరిశీలించేందుకూ, ప్రముఖ యాత్రాస్థలాల సందర్శనకూ, సామాజిక వైజ్ఞానిక సంస్కృతుల అవగాహనకూ – అయిపోతుంది. ఇక మిగిలిన సమయంలో చెయ్యగల రీసెర్చి ఏముంటుందిలే అని అటు డాడ్ స్కాలర్సూ, ఇటు జర్మన్ రీసెర్చి గైడ్సూ కూడా తేలికగా తీసుకోవడం కద్దు.

డాక్టర్ రాలెక్ కూడా ఆరంభంలో నన్ను అంత సీరియస్‌గా తీసుకోలేదు. నా అనుభవాన్నిబట్టి నాకు తోచిన పని చేసుకోమనీ, అవసరమైనప్పుడు తనని సంప్రదించమనీ చెప్పాడు. ఆ మాటల్నిబట్టి – తమ సంస్థ పనితీరునీ, అక్కడి సదుపాయాల్నీ అవగాహన చేసుకుందుకు నా ఏడాది సమయం చాలనుకున్నాడని నాకు తోచింది.

కానీ నేనక్కడికి సరదాగా కాలక్షేపం చెయ్యడానికి రాలేదు. నాకున్న సమయంలో – కొత్త పద్ధతిలో కొన్ని కెటలిస్టులు తయారు చేసి, అక్కడున్న సదుపాయాలతో వాటి గుణగణాల్ని పరీక్షించాలన్నది నా కోరిక. ఆ విషయం జర్మనీ వచ్చేముందు డాక్టర్ రాలెక్‌కి తెలియబర్చాను కూడా. ఆ విషయం మరోసారి ఆయనకి గుర్తు చేశాను. ఆయన వెంటనే చిన్నగా నవ్వి, పని ప్రారంభించడానికి ఏమేం కావాలో జాబితా తయారు చేసి తీసుకుని రమ్మని యథాలాపంగా చెప్పాడు.

నాకక్కడ పరిశోధనకు కావాల్సిన స్పెషల్ కెమికల్స్ జాబితా ఎప్పుడో సిద్ధం చేసుకున్నాను. వాటిలో ఆఫీసు స్టోర్లో దొరకనివేమిటో కూడా జాబితా తయారు చేసుకున్నాను. నేనా విషయం చెబితే – ఆయన ఏమేమి ఎంతెంత కావాలో కాగితంమీద రాసిమ్మన్నాడు.

ఎంత రాయాలీ అని ముందుచూపుతో ఆలోచించాను. ఆ ముందుచూపు కేవలం భారతీయులకు మాత్రమే అవసరమైనదని అప్పుడు నాకు తెలియదు. ఎందుకంటే –

ఇండియాలో ఐతే కెమికల్స్ కొనడానికి పెద్ద ప్రొసీజరుంది.

ముందు ఇండెంట్ ఫారంమీద కావాల్సిన కెమికల్స్ జాబితా వ్రాసి బాస్‌కివ్వాలి. బాస్ సంతకం పెట్టేక, స్టోర్సుకి వెళ్లి అవి స్టోర్సులో లేవని ఆ కాగితంమీద వ్రాయించాలి. అప్పుడా ఇండెంట్ పర్చేజ్ విభాగానికి వెడుతుంది. పర్చేజ్ ఆఫీసరు కొన్ని కంపెనీలకి ఉత్తరాలు రాస్తాడు. వాళ్లు కొటేషన్సు పంపిస్తారు. కొటేషన్సు రావడానికి కొద్ది నెలల నియమితకాలం ఉంటుంది. అన్ని కంపెనీలనుంచీ వెంటనే కొటేషన్స్ రాకపోతే గడువుతేదీ అయ్యేదాకా ఎదురు చూడాలి. అప్పుడు పర్చేజ్ విభాగంవారు అన్ని కంపెనీల కొటేషన్లనీ సరిపోల్చుతూ ఒక చార్ట్ తయారుచేసి ఆర్డరిచ్చిన సైంటిస్టుకి పంపుతారు. సైంటిస్టు ఆ చార్టు చూసి, అన్నింటిలోకీ చౌకగా ఇస్తున్న కంపెనీకి ఆర్డరిమ్మని రికమెండేషను ఇవ్వాలి. అలా కాని పక్షంలో, ఖరీదెక్కువున్న చోటకి ఆర్డరివ్వడాన్ని సమర్ధించుకుంటూ నోట్ రాయాలి. మళ్లీ దానిమీద బాస్ చేత సంతకం పెట్టించుకున్నాక, పర్చేజ్ విభాగంవారు ఆఫీసు అధినేత అనుమతి తీసుకుని ఆర్డర్ పంపిస్తారు. కంపెనీ తన వీలునిబట్టి నెమ్మదిమీద కెమికల్స్ డెలివరీ చేస్తుంది.

అందుకు అథమపక్షం నాలుగు నెలలు పడుతుంది. కానీ సాధారణంగా ఏడాది పడుతుంది. అందుకని మాకేం కావాల్సొచ్చినా, కనీసం రెండేళ్ల అవసరాలకి సరిపడ ఇండెంట్ ఇస్తాం. అందువల్ల చాలాసార్లు అవసరానికి మించి కొనడమూ, కొన్న కెమికల్స్ ఏళ్ల తరబడి వృథాగా మిగిలిపోవడమూ జరుగుతూంటుంది.

నేను బెర్లిన్లో ఉండేది ఏడాదే కదా అని – అందుకు తగ్గట్టుగా కెమికల్సు అవసరాన్ని లెక్కేసి, ఆ ప్రకారం క్వాంటిటీలతో ఓ జాబితా తయారు చేసి వెంటనే రాలెక్‌కి చూపించాను.

నేనంత వెంటనే జాబితా తెచ్చినందుకు ఆయన ముఖంలో అభినందనపూర్వకమైన మందహాసం వెలసింది. కానీ మరుక్షణమే ఆయన ముఖం గంభీరంగా మారిపోయింది. ఆయన జాబితా చదవడం పూర్తిచేసి గుండెలు బాదుకుని, “ఒకొక్క కెమికల్ కేజీల్లో రాశారు. మిగిలిపోతే ఏంచేద్దామని?” అన్నాడు.

ఆంగ్లంలో యు అంటే నీవు, మీరు అని అర్థం. కానీ జర్మన్లో భారతీయ భాషల్లో లాగే మన్ననకి జీ (మీరు), సుపరిచితులకి దు (నీవు) అంటూ వేర్వేరు పదాలున్నాయి. రాలెక్ నన్ను ‘మీరు’ అనే వ్యవహరించేవాడు.

అంత సంపన్న దేశంలో ఆట్టే ఖరీదులేని ఆ కెమికల్స్ గురించి అలా మాట్లాడ్డం, కక్కుర్తి వ్యవహారంలా అనిపించింది. “మిగిలిపోవడం గురించి మీరాలోచిస్తున్నారు. సరిపోకపోతే ఏం చెయ్యాలని నేనాలోచిస్తున్నాను” అన్నాను సీరియస్‌గా.

“సరిపోకపోవడమేమిటి? ఎంతెక్కువ వాడినా ఇప్పుడు మీరడిగిన క్వాంటిటీలో పదో వంతు కొంటే – ఈ కెమికల్సు కనీసం నెల్లాళ్లు వస్తాయి. అవి చాలని నా ఉద్దేశ్యం. అంతగా చాలకపోతే అప్పుడే మళ్లీ తెప్పించుకోవచ్చు” అన్నాడాయన.

నాకప్పుడు మా మామ్మగారు గుర్తుకొచ్చారు. డబ్బు ఇబ్బందిగా ఉన్నప్పుడు, ఆమె వంట అవసరానికి ఏ పూట సరుకు ఆ పూట తెప్పించేవారు. తెచ్చేది నేనే కదా, అన్నిమార్లు తిరగలేక, “కనీసం వారానికి సరిపడ కొనచ్చుగా” అనేవాణ్ణి.

“సాయంత్రానికి ఇంకేమైనా అవసరమొచ్చిందనుకో. డబ్బు దానికి ఖర్చు పెట్టాలి. తిండిదేముంది? ఉంటే పంచభక్ష్య పరమాన్నాలు. లేకుంటే ఊరగాయతో సరిపెట్టుకుంటాం” అనేదామె.

కష్టకాలంలో ఇల్లు నడవడానికి ఆమే కారణమని మా తాతగారు పదేపదే మెచ్చుకునేవారు.

కానీ ఈ సంపన్నదేశంలో కెమికల్సు కాసిని ఎక్కువ కొనలేనంత కష్టకాలమేం లేదు కదా! ఆ మాట సూటిగా అనలేక, “నెల్లాళ్లాగి మళ్లీ తెప్పించుకోవడమా, ఇలాగైతే ఇక్కడ నా కాలమంతా పర్చేజ్ ఆ తతంగానికే ఐపోతుందన్నమాట!” అని నిట్టూర్చాను.

“తతంగమేమిటీ?” అన్నాడాయన తెల్లబోయి.

ఇంత చిన్న విషయం విడమర్చి చెబితే కానీ అర్థం కాదా అనుకుంటూ – ఒక కొనుగోలుకి జరిగే తతంగమంతా వివరించాను.

నేను చెప్పింది ఆయనకి వెంటనే అర్థం కాలేదు. ఒకటికి రెండుసార్లడిగి చెప్పించుకున్నాక ఆకళింపు అయినట్లుంది. ఆ వెంటనే భళ్లున నవ్వేసి, “ఓహ్, మర్చేపోయాను. మీరొచ్చింది ఇండియానుంచి కదూ!” అన్నాడు.

ఆ నవ్వులో ధ్వనించిన వ్యంగ్యానికి కాస్త నొచ్చుకున్నా, అసలు విషయం వినేసరికి సిగ్గుపడక తప్పలేదు.

నేనో జాబితా తయారు చేశాను కదా! ఆ కాగితంమీద రాలెక్ సంతకం పెట్టి ఇస్తాడు. నేనా కాగితాన్ని ఆఫీసులో సెక్రటరీకిస్తాను. ఆమె కెమికల్స్ సరఫరా చేసే కంపెనీకి ఫోన్ చేస్తుంది. ఆ కంపెనీ పొరుగూరిది కాకపోతే, మరో గంటలో నేనడిగిన కెమికల్స్ నా బల్లమీదుంటాయి. కంపెనీ పొరుగూరిదైతే దూరాన్నిబట్టి రెండు మూడు రోజుల్లో సరుకు నా బల్లమీదికొస్తుంది.

నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను.

నియమాలు పెరగడంవల్ల – వాటి అమలుకి ఉద్యోగులు అదనం, సమయం అదనం, కొనుగోలు కూడా అవసరానికి మించి అదనం. అన్నింటికీ మించి కావాల్సిన వస్తువు కావాల్సిన రోజుకి లభించదు. అదీ మన వ్యవస్థ. అందుకు పూర్తి భిన్నంగా ఉండడంవల్లనే ఈ దేశం ప్రగతిపథంలో ముందుకు దూసుకుపోతోందా?

ఆలోచనలు పరిపరివిధాల పోతుంటే – అదుపు చేసి అక్కడి వాస్తవానికొచ్చాను.

వెంటనే నా అవసరాలు మారిపోయాయి. కాగితంమీది అంకెలూ మారిపోయాయి. ఆ రోజు సాయంత్రానికే నేనడిగినవి నా బల్లమీదున్నాయి.

కొద్ది రోజుల్లోనే రాలెక్‌కి తెలిసిపోయింది. నేనక్కడికి కాలక్షేపానికి రాలేదని. ఆయన నాతో సబ్జెక్ట్ డిస్కషన్ మొదలెట్టాడు. నాది ప్రిపరేటివ్ కెమిస్ట్రీ. ఆయనది టెక్నాలజీ టెస్టింగ్. ఇద్దరూ ఒకరి పరిధి ఒకరు తెలుసుకుని, ఒక స్కీము తయారు చెయ్యడానికి కొన్ని రోజులు పట్టింది.

నేను తయారు చేసే శాంపిల్స్ టెస్ట్ చెయ్యడానికి అక్కడ లాబొరేటరీలో రెడీగా ఉన్న యూనిట్లు లేవు. కొత్తగా డిజైన్ చెయ్యాలి. అందుకుగానూ నేను లైబ్రరీకి వెళ్లి సైంటిఫిక్ జర్నల్సు శోధించి అనువైన కొన్ని డిజైన్లు తెచ్చాను. తర్వాత నేను, రాలెక్, వర్కుషాపులో ఓ ఇంజనీరు కలిసి కూర్చుని చర్చించి ఓ టెస్టింగ్ యూనిట్‌కి డిజైన్ రూపొందించాం.

యూనిట్ తయారు చెయ్యడానికి 3–4 నెలలు పడుతుందన్నాడు ఇంజనీరు. ఎందుకంటే మా టెస్టింగు హై ప్రెషర్లో జరుగుతుంది. ఆ ఒత్తిడికి తట్టుకుని నిలబడే స్పెషల్ స్టీల్ బెర్లిన్లో దొరకదు. అది తెప్పించడానికి రెండు వారాలకి పైగా పడుతుంది. ఆపైన క్రిస్మస్ సెలవులు. వర్క్‌షాప్ ఇంజనీరు నెల్లాళ్లు సెలవులో ఉంటాట్ట.

నాకూ ఆ యూనిట్ వెంటనే అవసరం లేదు.

టెస్టింగుకి శాంపిల్స్ తయారు చెయ్యాలి కదా, అందుకా వ్యవధి ఎలాగూ అవసరం.

డాక్టర్ రాలెక్ తన సబ్జక్టులో అఖండుడు. ఇతరత్రా కూడా ఆయన పరిజ్ఞానం నాకు ఆశ్చర్యం కలిగించేది. ఆయన నాతో భారతీయ సంస్కృతి గురించి అడపాతడపా చర్చిస్తుండేవాడు. అలాంటప్పుడు ఆయనతో నాకు చిన్న ఇబ్బంది ఉండేది.

రాలెక్‌ది తొందరపాటు స్వభావం. ఏదైనా విన్నప్పుడు త్వరగా ఓ నిర్ణయానికొచ్చేస్తాడు. ఇక మన మాట వినకుండా తన అభిప్రాయం చెప్పేస్తాడు. ఆ తర్వాత దాని గురించి శ్రద్ధగా ఆలోచించి ఆకళింపు చేసుకుని అవసరమైతే తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడు కూడా.

ఆయన కమ్యూనిజానికి బద్ధవిరోధి. అందుక్కారణముంది. ఆయనది ఒకప్పుడు చెకొస్లొవేకియా. స్కాలర్‌షిప్ మీద ఈ దేశానికొచ్చి క్రమంగా స్థిరపడిపోయాడు. ఇండియా కమ్యూనిజం వైపు మొగ్గుతున్నదని ఆయన బాధపడేవాడు. ఆయనకు ఆసియా దేశాలపట్ల చిన్నచూపు కూడా ఉంది. అక్కడి పౌరులు అనాగరికంగా జీవిస్తున్నారని ఆయన అనుకునేవాడు.

డాక్టర్ రాలెక్ మిత్రుడొకడు తరచు భారత దేశానికి వెళ్తొస్తుంటాడు. ఆయన రాసే ఉత్తరాలు కూడా రాలెక్ అభిప్రాయాల్ని ప్రభావితం చేస్తుంటాయి. ఆ మిత్రుడొకసారి,

"వానాకాలంలో ఇండియన్ రీసెర్చి లాబొరేటరీలకు ఈదుకుని వెళ్లాలి" అని వ్రాసేట్ట. రాలెక్ ఆ విషయం నాకు చెప్పి, "నిజమేనా?" అనడిగాడు.

నాకు కోపం వచ్చింది కానీ, అలాంటప్పుడు ప్రశాంతంగా ఉండడమే విజ్ఞత అని తెలుసు. "మంచు కురిసే చోట తవ్వుకుంటూ వెళ్లాలి కదా, అలాగే వరదలొచ్చినచోట ఈదుకుంటూ వెళ్లాల్సిరావచ్చు. అది లొకేషన్ బట్టి ఉంటుంది. ఐతే నాకు తెలిసిన ఏ రీసెర్చి లాబొరేటరీకీ వానాకాలం సమస్య లేదు" అని చెప్పాను. *( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments